క్లుప్తంగా

ఎమ్మెల్యే పంతం నానాజీపై చర్యలు తీసుకోవాలి

కె.గంగవరం: దళిత వైద్యుడిపై చేయిచేసుకున్న కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం మాలమహానాడు నాయకులు రవ్వా భూషణం, తరపట్ల ఆనందరావు తదితరులు డిమాండ్ చేశారు. కె.గంగవరంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నానాజీపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి వ్యక్తులను పార్టీకి దూరంగా ఉంచాలని కోరారు. నాయకులు జ్యోతికుమార్, భీమారావు, వినకోటి శ్రీనిసరావు తదితరులు పాల్గొన్నారు.

రఘురామపై అట్రాసిటీ కేసు పెట్టాలి

మండపేట: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పలివెల సుధాకర్ సోమవారం డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో జరిగిన ఘటనపై ఆయన స్పందించారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే భారత జాతిని కించ పరిచినట్టే అని ఆయన పేర్కొన్నారు.

100 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

మండపేట: అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇద్దరిని సోమవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. యానాం నుంచి మండపేటకు యాక్టివా మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై శాస్త్రి తన సిబ్బందితో కలసి దాడి చేశారు. తాళ్లరేవు మండలం నేలపల్లికి చెందిన పత్తి శివ సత్యనారాయణ, యానాంకు చెందిన గుర్రం భైరవస్వామి అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి యాక్టివా మోటార్ సైకిల్‌ను, 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 100 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆలమూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో స్కూల్ హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు

కాజులూరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు కాజులూరు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జేమ్స్ రవిసుందర్‌కొర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో సోమవారం రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు జరిగాయన్నారు. అండర్ 19 ఫుట్‌బాల్ విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి టీమ్‌లను ఎంపిక చేశారన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు కాదా లక్ష్మీదుర్గా, పెద్దిరెడ్డి సుప్రియ విశేష ప్రతిభ కనబడిచి రాష్ట్ర స్థాయి బాలికల జట్టుకు, వట్టూరి మణికంఠ బాలుర జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. అండర్ 19 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు బీపీ సత్యనారాయణ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ కొర్, నాగలక్ష్మిలను స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, విద్యాకమిటీ చైర్మన్ పద్దరాజు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

స్వచ్ఛతా హి సేవ ర్యాలీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో సోమవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత కోసం అందరం కలసి పాటు పడదాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలోని వీధులను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. గ్రామస్తులకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

సామూహిక సీమంతాలు

మండపేట: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక టౌన్ హాల్లో సోమవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, కౌన్సిలర్లు గుండు రామతులసి, కాళ్లకూరి స్వరాజ్య భవాని 64 మంది గర్భిణులకు పసుపు, కుంకుమ, గంధం వంటి తిలకాలు అద్ది సీమంతం చేశారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం

మండపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండపేటలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అధికారులు నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని వంద రోజుల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. చేయబోయే మంచిని కూడా ప్రజలకు తెలియజేశారు.

ఉన్నత సేవ నుంచి స్టిక్కర్లు అతికించే స్థితికి..

- సచివాలయ ఉద్యోగులతో స్టిక్కర్లు అతికిస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం
- ప్రజల ముందు గౌరవించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- తొలి రోజుల్లో వీరిని ఉద్యోగులే కాదన్న కూటమి నేతలు
- పెన్షన్ల పంపిణీకి వారే దిక్కైన వైనం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగి నవీన్‌ను ప్రజలందరి ముందు సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట (ఫైల్)



కూటమి ప్రభుత్వంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న కేదారిలంక సచివాలయ ఉద్యోగి

కపిలేశ్వరపురం: ప్రజల బాగు కోరి ప్రభుత్వాలు వ్యవస్థలను బలోపేతం చేస్తాయి. వ్యవస్థల్లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ ప్రజలకు సేవ చేసేందుకు వాహకులుగా ఉంటారు. ప్రజల్లో 80 శాతం మంది పేద, మధ్య తరగతి వారే. స్థిరాస్తులు లేక రెక్కలను ముక్కలు చేసుకుంటూ ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూసే జీవితాలు వారివి. బాధ్యత ఎరిగిన ప్రభుత్వం పాలనా కాలమంతా ఆ ప్రజల సేవలో తరించాలి. అలా జరిగిన నాడు పాలకులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల నుంచి గౌరవం దక్కుతుంది. అదే జరిగింది 2019–24 పాలనా కాలంలో. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి ప్రణాళికాబద్ధంగా చెప్పిన తేదీన చెప్పిన సాయాన్ని పేదలకు అందించారు. అందుకోసం సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. కారణాలేమైనా నోటికొచ్చిన వాగ్దానాలన్నీ ఇచ్చి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వంద రోజుల పాలనలోనే వలంటీర్లను విధుల నుంచి దూరం పెట్టింది. సచివాలయ ఉద్యోగులపై పనిభారం పెంచింది.

ఆది నుంచీ వ్యతిరేక వైఖరే..

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రాజకీయ పార్టీల అధినేతలు, వారి శ్రేణులు తొలి నుంచి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పట్ల, వ్యతిరేక వైఖరితో ఉన్నారు. 2019లో ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులను నియమించినపుడు సచివాలయాలు ఆచరణలో సాధ్యం కాదంటూ వెటకరించారు. వారందకీ విధులు కేటాయించినపుడు వీరిని తీసివేస్తారంటూ ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారందరికీ ప్రొబేషన్‌ను పూర్తి చేసి శాశ్వత ఉద్యోగులను చేశారు. ఉద్యోగమంటే ఇచ్చారు కానీ వీరందరిని ఎక్కడ కూర్చోబెడతారంటూ మరోసారి వెటకరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ప్రతి ఊరుకూ నిధులు కేటాయించి సొంత భవనాలు సమకూర్చారు. మొత్తం సచివాలయ వ్యవస్థ పటిష్టమై పని చేయనారంభించింది. అప్పటి వరకూ వెటకరించిన ఆ నాటి ప్రతిపక్షాల వారు సచివాలయాల్లో ఉద్యోగులను ఖాళీగా కూర్చోబెట్టి జీతాలిస్తున్నారంటూ వైఎస్ జగన్‌పై అక్కసు వెళ్ల గక్కారు. ఏది అయితేనే అలా మాట్లాడిన వారికి నేడు సచివాలయ ఉద్యోగులే దిక్కయ్యే పరిస్థితి నెలకొంది.

క్లస్టర్ పరిధిలో సచివాలయాలిలా...

మండపేట నియోజకవర్గంలోని 43 గ్రామాల పరిధిలో 79,406 కుటుంబాల్లో 2,65,944 మంది జనాభా ఉన్నారు. రామచంద్రపురం మండలంలోని 77 గ్రామాల్లోని 70,450 కుటుంబాల్లో 2,43,410 మంది ప్రజలున్నారు. మండపేట మున్సిపాలిటీలో 29 వార్డుల పరిధిలో 17 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మండపేట మండలంలోని 12 గ్రామాల్లో 23 సచివాలయాలున్నాయి. 19 గ్రామాలున్న కపిలేశ్వరపురం మండలంలో 20, 12 గ్రామాలున్న రాయవరం మండలంలో 19, నియోజకవర్గం మొత్తంలో 79 సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటి పరిధిల్లో 512 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీలో 12, రూరల్ మండలంలో 20, కె.గంగవరం మండలంలో 23, కాజులూరు మండలంలో 23 నియోజకవర్గం మొత్తంలో 78 సచివాలయాలున్నాయి.

ఉద్యోగులతో స్టిక్కర్లు అతికిస్తున్నారు..

అనారోగ్యంతో నీరసించి ఇంటిపట్టునున్న రోగుల వద్దకెళ్లి వైద్యసేవలందించిన ఘనత సచివాలయ ఉద్యోగిది. కిడ్నీ వ్యాధితో విజయవాడ, విశాఖపట్టణం తదితర దూర ప్రాంతాల్లో వైద్యం చేయించుకుంటున్న రోగి వద్దకు వెళ్లి రూ.10 వేల సాయం సొమ్మును చేతికందించిన సేవకులు సచివాలయ ఉద్యోగులు. అమ్మ ఒడి మంజూరులో సాంకేతిక సమస్య వస్తే వెల్ఫేర్ అసిస్టెంట్ వెంటనే స్పందించి రూ.15 వేలు సాయమందించేవారు. అలాంటి ఉద్యోగులచే నేటి ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తుంది. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించమంటోంది.

పింఛన్ల పంపిణీ ఘనతా వారిదే..

కూటమి ప్రభుత్వం వలంటీర్లను పక్కన పెట్టింది. వారి పని భారాన్ని సచివాలయ ఉద్యోగులపై మోపుతోంది. వలంటీర్లు లేకుండానే ఒకటో తేదీనే 90 శాతం పైగా పింఛన్లను పంపిణీ చేశామంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారి పార్టీల నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. అలా పెన్షన్ల పంపిణీని పూర్తి చేసిన ఘనత పూర్తిగా సచివాలయ ఉద్యోగులకు దక్కుతుంది. ఆ సచివాలయ ఉద్యోగులను, వ్యవస్థను ఉనికిలోకి తీసుకొచ్చింది ఎవరని ప్రశ్నించుకోలేని స్థితిలో కూటమి నేతలున్నారు.

సేవల కుదింపు – పనిభారం పెంపు

సచివాలయ ఉద్యోగులను కూర్చోబెట్టి జీతాలిస్తున్నారంటూ ఆనాటి ప్రతిపక్షాలు వ్యాఖ్యానాలు చేసేవారు. ఎన్నికల్లో ఇబ్బడి ముబ్బడిగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. తీరా వంద రోజుల పాలనా తీరును పరిశీలిస్తే సేవలు కుదించారు. సచివాలయ ఉద్యోగుల చేతులు మీదుగా ఒక్క రేషన్ కార్డు కూడా జారీ చేయనివ్వలేదు. కొత్త పింఛన్లు మంజూరు చేయించిందీ లేదు. కొత్త ఆరోగ్యశ్రీ కార్డును ఇప్పించింది లేదు. సచివాలయ ఉద్యోగులపై పనిభారాన్ని పెంచారు. రాత్రింబవళ్లు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద విధులను కేటాయించారు. జూన్ 13న ఇసుక నిల్వలను అక్రమంగా తరలించే ప్రయత్నం కూటమి నేతలు చేయగా ప్రజలు అడ్డుకున్నారు. ఒక పక్క నిల్వలను అక్రమంగా తరలించేస్తుండగా వాటిని కాపలాకాయండంటూ సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించడం ఉద్యోగుల్లో తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వరదల సమయంలో లంక గ్రామాల్లో రాత్రివేళ మహిళా ఉద్యోగులను సైతం రేవుల వద్ద కాపలా కాయించారు.

ఆత్మగౌరవాన్ని కాపాడని ప్రభుత్వం

సీఎం వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేసేందుకు సచివాలయ ఉద్యోగాల నియామకం చేపట్టారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను మేరకు ఆరోగ్యకరమైన పోటీ ద్వారా క్వాలిఫై ఉద్యోగాలు పొందారు. ప్రభుత్వ శాఖల పట్ల, ప్రజల స్థితిగతుల పట్ల సంపూర్ణ అవగాహన ఉన్న సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలన్నది శాస్త్రబద్ధంగా ఉండాలి. వారి ఆత్మగౌరవాన్ని మరిన్ని రెట్లు పెంచే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.

సైన్స్‌తోనే శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి

- ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్త కావాలి
- ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త శివప్రసాద్



సెమినార్‌లో మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్

రాయవరం: సైన్స్‌తోనే శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెంది, నాగరిక సమాజానికి బాటలు వేసిందని ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. అంతరిక్ష పరిశోధనలపై సోమవారం స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో శివప్రసాద్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం పురోభివృద్ధి సాధించడం వల్లే సమాజం కొత్త పుంతలు తొక్కిందన్నారు. ప్రతి విద్యార్థిలో సృజనాత్మకత దాగి ఉంటుందని, దానికి పదును పెడితే ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత్త అవుతారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అంతరిక్ష ప్రయోగాలలో భారతదేశం ప్రపంచ దేశాల సరసన నిలవడానికి భారతీయ శాస్త్రవేత్తలే కారణమన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ దంపతులను హెచ్‌ఎం సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వై.సూర్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పడాల సత్యనారాయణరెడ్డి, భాస్కరరామారావు, వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

కాజులూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎలుకల నివారణ మందుపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం వీఏఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. కాజులూరు మండలంలో 19 వేల ఎకరాల సాగుభూమి ఉండగా 81 కేజీల మందును ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు మంగళవారం ఎలుకల నివారణ మందు అందజేయాలని సూచించారు. అనంతరం విషపు ఎర తయారీపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

సంస్కృతీ సంప్రదాయాలే జీవన విధానం



కపిలేశ్వరపురంలో వేద మంత్రాలను చదువుతున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలే మానవ జీవన విధానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేంద్ర మాజీ సహాయ మంత్రి, శ్రీసర్వారాయ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు జయంతి, స్థానిక శ్రీసర్వారాయ హరికథ, వేద పాఠశాల 52వ వార్షికోత్సవాలను సోమవారం స్థానిక పాఠశాలల సముదాయంలో నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత జమీందారు సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్ ఎస్ఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ సత్యనారాయణరావు, రాజరాజేశ్వరి దంపతులు చేసిన కృషిని కొనియాడారు. వేద పాఠశాల ప్రిన్సిపాల్ తంగిరాల దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలోని విద్యార్థులు వేద స్వస్తి చెప్పారు. హరికథా పాఠశాల ప్రిన్సిపాల్ అంగర సింగరాచార్యులు పర్యవేక్షణలో హరికథ పాఠశాల విద్యార్థినులు వివిధ ఘట్టాలపై తమ కళను ప్రదర్శించారు. ముఖ్య అతిథులు గొర్తి రామచంద్రరావు, కమ్మ వెంకట్రావు, పాఠశాలల బోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశాలల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



వెంటూరు–2 సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం

రాయవరం: మండలంలోని మాచవరం పీహెచ్‌సీ, వెంటూరు–2 గ్రామ సచివాలయం పరిధిలోని ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం తనిఖీ చేసింది. ఈ బృందంలోని స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.వీరన్నబాబు, డీపీహెచ్‌ఎం పీపీఎల్ కుమారి రికార్డులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మాతృ, శిశు మరణాల రేటు ఎలా ఉంది? మాతాశిశు సంరక్షణ, కిల్కారీ సేవలు రోగులకు ఏ విధంగా అందుతున్నాయి? కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారా? లేదా? వారికి అవగాహన సమావేశాలు ఏ మేరకు నిర్వహిస్తున్నారు? తదితర అంశాలను పరిశీలించారు. రికార్డులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎంపీహెచ్‌ఈవో తులసీదాస్, ఎంపీహెచ్ఎస్ ఎ.గోపాలకృష్ణ, ఎం.రాజకుమారి, ఏఎన్ఎంలు పి.సూర్యకుమారి, ఇంద్రజ, ప్రియదర్శిని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకేరు పీహెచ్‌సీలో తనిఖీలు



ఎన్‌క్యూఏఎస్‌సీ టీం సభ్యులతో ఆసుపత్రి సిబ్బంది

కె.గంగవరం: మండల పరిధిలోని పేకేరు పీహెచ్‌సీని సోమవారం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ కమిటీ (ఎన్‌క్యూఏఎస్‌సీ) టీం సభ్యులు సందర్శించారు. టీమ్ సభ్యులు డాక్టర్ కిరణ్ ప్రసాద్, విజయలక్ష్మి, నాగేంద్ర తదితరులు ఆసుపత్రిలోని రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని ఫార్మసీ, లేబొరెటరీ, ఆఫీస్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు తెలుసుకోవడానికి తనిఖీ చేశామన్నారు. వైద్య సేవలను మరింత మెరుగుపర్చడానికి తీసుకోవల్సిన చర్యలను ఆసుపత్రి సిబ్బంది వివరించామన్నారు. పీహెచ్‌సీ వైద్యులు శ్రీలక్ష్మి, డాక్టర్ రేఖారాణి, సునీత, కమల్ శేషు, సూపర్‌వైజర్స్ పీవీవీ సత్యనారాయణమూర్తి, రాజశేఖర్, మంగాదేవి, ఏఎస్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులదే కీలకపాత్ర



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో సఫాయి సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్



తాత్కాలిక ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రామచంద్రపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని, వారు అనారోగ్యం బారిన పడకుండా ముందుగానే వారికి ప్రభుత్వం వైద్య పరీక్షలు నిర్వహిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం సఫాయి సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పారిశుధ్య కార్మికులకు ఉచితంగా అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 1 వరకూ పక్షం రోజులపాటు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సఫాయి సురక్ష కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, ఎంపీడీవో సెట్‌రాజ్, కూటమి నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

600 మంది పారిశుధ్య సిబ్బందికి వైద్య సేవలు

మండపేట: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మండపేట నియోజకవర్గంలోని పారిశుధ్య సిబ్బంది కోసం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఓపీ విభాగాన్ని చైర్ పర్సన్ దుర్గారాణి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి నేతృత్వంలో పారిశుధ్య సిబ్బందికి వైద్యులు పరీక్షలు చేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని 600 మంది పారిశుధ్య సిబ్బందికి షుగర్, హెచ్ఐవీ, హెపటైటిస్, ఈసీజీ, టీబీ, ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధాకుమారి తెలిపారు. అవసరమైన వారికి కుక్కకాటు వ్యాక్సిన్, హైపటైటిస్ వ్యాక్సిన్‌లు వేశామన్నారు. శిబిరంలో వైద్యులు సీహెచ్ రాజీవ్, సీహెచ్‌బీవీ సారథి, పి.ప్రశాంతి, సుప్రియ తదితరులు సేవలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ టౌన్ అధ్యక్షుడు వుంగరాల రాంబాబు, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, ఎంపీడీవో కె.సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మంచిది కాదు.. ముంచే ప్రభుత్వం

ఏఐసీసీ సభ్యుడు 'కామన' ఆగ్రహం

మండపేట: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఏదో సాధించినట్టు 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ డబ్బాలు కొట్టుకుంటున్న కూటమి ప్రభుత్వంపై ఇదే ముంచే ప్రభుత్వం మాత్రమేనని ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు విమర్శించారు. పట్టణంలోని ఏడిద రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. మండపేటలో ఏనాటి నుంచో కల్తీ నేతి వ్యాపారులు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు ధైర్యముంటే వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. వంద రోజులు పాలనలో మంచి ప్రభుత్వం అని చెప్పుకోవడాని ఏముందని ఆయన ప్రశ్నించారు. మండపేట, ఏడిద, ద్వారపూడి జెడ్.మేడపాడు రోడ్ల నిర్మాణాలను గాలికి వదిలేసినందుకు అవి ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారినందుకా? ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటారా అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసి మంచి ప్రభుత్వం అని గొప్పలకు పోతే బాగుంటుందని కూటమి నేతలకు హితోపదేశం చేశారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

రామచంద్రపురం: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్ సోమవారం తెలిపారు. దీనిలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖలతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు రైతులకు సాగుకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక లాభం ఆర్జించేందుకు అనుసరించాల్సిన విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. తొలిరోజు మండలంలోని వెల్ల, కాపవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

కపిలేశ్వరపురం: వ్యవసాయ,అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే పద్ధతులపై రైతులకు వివరించే లక్ష్యంతో పొలంబడి నిర్వహించనున్నామన్నారు. మంగళవారం ఉదయం టేకి రైతు సేవా కేంద్రంలోనూ, మధ్యాహ్నం వాకతిప్ప, బుధవారం ఉదయం అద్దంకివారిలంక, మధ్యాహ్నం కేదారిలంక గ్రామాల్లోనూ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఏఓ రమేష్‌కుమార్ తెలిపారు.

పాఠశాలకు దాతల వితరణ



గొల్లపాలెంలో స్పోర్ట్స్ యూనిఫాం, బీరువాలు అందజేసిన దాతలతో క్రీడాకారులు

కాజులూరు: దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌టీ సుశీలామణి సూచించారు. పాఠశాల క్రీడామైదానంలో ఇటీవల మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు గ్రామానికి చెందిన దాత కోట వెంకటేశ్వరరావు స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు. పాఠశాల స్పోర్ట్స్ రూమ్‌లో సామాన్లు భద్రపరచుకునేందుకు దాతలు వడ్డి శ్రీను, దేగల సతీష్, రిటైర్డ్ టీచర్ డీవీఎస్ శంకరమణి మూడు బీరువాలను బహూకరించారు. ఎస్ఎంసీ చైర్మన్ కొలిశెట్టి సత్యం, స్కూల్ పీడీ సునీల్‌కుమార్, దాతలను అభినందించారు.

అన్న సమారాధనలు

కె.గంగవరం: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని సోమవారం పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. కె.గంగవరం రైల్వే కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



పాఠశాలలో రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ హైస్కూల్ పోస్టుగాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా విధులు నిర్వర్తిస్తున్న బీపీ రామకృష్ణను ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రామకృష్ణను పాఠశాలలో హెచ్‌ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో అభినందించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు వి.సాయన్న, ఎస్ఏ రహమాన్, పడాల సత్యనారాయణరెడ్డి, దేవరకొండ సుబ్బారావు, నల్లమిల్లి అప్పారెడ్డి తదితరులు రామకృష్ణ సేవలను ప్రశంసించారు. అనంతరం రామకృష్ణ దంపతులను దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొవ్వూరి రామారెడ్డి, భాస్కర రామారావు, రాజశేఖర్, జయలక్ష్మి, లిల్లీ, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

వెలగతోడు హైస్కూల్లో ఓజోన్ వారోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మండపేట: ప్రపంచ ఓజోన్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మండలంలోని వెలగతోడు జెడ్పీ హైస్కూల్లో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత గ్రామంలో ఓజోన్ పొరను రక్షించుకోవడం అందరి బాధ్యత అని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, అలీ, అడపా శ్రీనివాస్, సత్యనారాయణ, వీరభద్రరావు, కృష్ణమూర్తి, సహదేవుడు, ఏసురాజు, సాయిబాబా, ఆనంద్, రత్నకుమారి, ఎస్ఎంసీ కమిటీ, పంచాయితీ సభ్యులు పాల్గొన్నారు.